క్లుప్తంగా

మహిళా సాధికారతపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల అభ్యున్నతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ మహాలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలు, పోషకాహార లోపం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలిగే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు గురించి వివరించారు. లింగనిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం ఆంథోనిరాణి, మహిళా పోలీసు షేక్ షబానా, అంగన్‌వాడీలు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండాలి

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్

మంగళగిరి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అధికార పార్టీలో ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసినా వారికి ఎలాంటి గుర్తింపు గానీ, పదవులు గానీ, నామినేటెడ్ పోస్టులు గానీ ఇవ్వలేదని విమర్శించారు. కేవలం అగ్రకులం వారే పెత్తనం సాగిస్తూ పదవులు పొందుతున్నారని అన్నారు. రాజధాని లేకుండా మూడు రాజధానుల పేరుతో నాటకాలు ఆడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. సమావేశంలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ సైదా, పఠాన్ ఉమర్‌ఖాన్, సయ్యద్ ఖమురున్నీసా, గుర్రం రామారావు, సయ్యద్ రిజ్వానా, షేక్ జానీ, షేక్ బాషా పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.4కోట్లతో అభివృద్ధి



తాడేపల్లిరూరల్: నాలుగు సంవత్సరాల్లో నాలుగు కోట్ల రూపాయలు ఖర్చుచేసి మండలాన్ని అభివృద్ధి చేశామని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధులతో వివిధ గ్రామాల్లో రైతులు ఇబ్బందులు తెలుసుకుని డొంక రోడ్లు నిర్మించామని, గ్రామాల్లో అంతర్గతంగా సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్, కె.సురేష్, షేక్ సుభాని, షేక్ సల్మా, జానీబాయ్, పద్మావతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మంగళగిరి: నగరంలోని బాప్టిస్ట్‌పేటకు చెందిన కొదమల ప్రసంగి అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రసంగి కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

సాయుధ దళాల కవాతు



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన నవులూరు, బేతపూడిలో గురువారం సాయుధ దళాలు కవాతు నిర్వహించాయి. రూరల్ సీఐ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

తాడికొండ: శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా అండగా నిలుస్తుందని తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తాడికొండ మండలం కంతేరు గ్రామంలో కేంద్ర పోలీసు బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరంగా మహిళ ఫోన్‌కు మెసేజ్‌లు పెట్టడంతో పాటు ఆమె ఫొటోలు మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పంపిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివసించే ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తి నువ్వంటే నాకు ఇష్టమంటూ మెసేజ్ పెట్టాడు. మహిళ ఆ నంబరు బ్లాక్ చేసింది. అయితే, అతడు మహిళ ఫొటోలు అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వాట్సాప్ చేశాడు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- ఆత్మకూరులో సమన్వయకర్త లావణ్య ప్రచారం



ఆత్మకూరులో వృద్ధురాలి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న సమన్వయకర్త మురుగుడు లావణ్య, చిత్రంలో ఎమ్మెల్యే ఆర్కే, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

మంగళగిరి: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు జరగాలంటే జగనన్నతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వారి కార్యకర్తలకే పథకాల లబ్ధి చేకూరేదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి ఆ పథకాల ద్వారా ఇప్పటి వరకూ లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేశారని గుర్తు చేశారు. ప్రజలకు పారదర్శకంగా పథకాలను అందజేసేందుకు సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని, తద్వారా ఎటువంటి అవినీతికి తావు లేకుండా పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని వివరించారు. తాము ప్రతి ఇంటికి పర్యటిస్తున్న సమయంలో ప్రజలందరిని ఒక ప్రశ్న తప్పకుండా అడుగుతున్నామని, మీ వలంటీర్ ఎలా విధులు నిర్వహిస్తున్నారో చెప్పాల్సిని కోరుతున్నామన్నారు. ప్రజలంతా తమ వలంటీర్లు అన్ని రకాల సేవలు అందజేస్తున్నారని చెబుతున్నారని వివరించారు. అందరి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోమారు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోమారు ఘన విజయం సాధించడం తథ్యమని అన్నారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్యకు నియోజకవర్గ ప్రజలు అండగా నిలబడి విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లవరపు సుధారాణి, పాలేటి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే సంక్షేమం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- తాడికొండలో 4వ విడత వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ



మహిళలకు చేయూత చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ప్రజా ప్రతినిధులు

తాడికొండ: ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడం ఒక్క జగనన్నకే సాధ్యమైందని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అందరికీ సంక్షేమం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఆలోచించి తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలోనే గొప్పగా నిలిచిపోతున్నాయనేందుకు కేంద్ర ప్రభుత్వ నివేదికలే నిదర్శనమన్నారు. ఏపీలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయంటే జగనన్నకు పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత 5 సంవత్సరాలలో అందించిన సంక్షేమం కొనసాగాలన్నా, మంచి పనులు కావాలన్నా మనకి ఎవరు కావాలమ్మా అని చేయూత లబ్ధిదారులను అడుగగా వారు ముక్త కంఠంతో చిరునవ్వు చిందిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ఉచ్చరించడంతో సభలో హర్షధ్వానాలు మోగాయి. మన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 127 సార్లు సంక్షేమ పథకాల బటన్ నొక్కారని, ఆయన కోసం మనం ఒక్కసారి రెండు బటన్‌లు నొక్కి 175 సీట్లలో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మహిళా సంక్షేమానికి పుట్టింటి వారు ఆలోచించిన రీతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో మహిళల కోసం ఆలోచించి ప్రవేశపెట్టిన పథకాలు మంచి ప్రజాదరణ పొందాయని కొనియాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళా ఉద్యోగులు, సిబ్బంది, వెలుగు వీవోఏలను ఎమ్మెల్యే సుచరిత సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజినీ, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో అనురాధ, ఏపీఎం సాంబశివరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగరంలోని టిడ్కో గృహ సముదాయం ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయానికి గురువారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే నగరంలో ఏడు అధునాతన విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించామన్నారు. సుమారు రూ.కోటి వ్యయంతో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయాన్ని జి ప్లస్ టూ భవనాన్ని నిర్మిస్తున్నామని, సుమారు లక్షన్నర మంది ప్రజలకు కార్యాలయం సేవలు అందించనున్నట్లు చెప్పారు. సెంట్రల్ పవర్ కార్పొరేషన్ ప్రజలకు సేవలు అందించేందుకు ముందు ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎండీ సంతోషరావు, డైరెక్టర్ జయభారత్‌రావు, విద్యుత్‌శాఖ ఏడీఈ అక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ బుద్దా రోడ్డు ప్రారంభం

మంగళగిరి నగరంలో పెద్ద రోడ్డు నిర్మించుకోవడం సంతోషదాయకమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలో సుమారు రూ.13.5 కోట్ల నగర పాలక సంస్థ సాధారణ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన గౌతమ బుద్ధారోడ్డును గురువారం ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఆవిర్భావం జరిగిందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి ఇటువంటి రోడ్డు అవసరమన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు. నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.మల్లేశ్వరరావు, బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు, మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మురుగుడు
- ఘనస్వాగతం పలికిన ముస్లిం సోదరులు



ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో ముస్లిం కమ్యూనిటీ హాలు, పీర్లు భద్రపరిచే భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు మాట్లాడుతూ 100 సంవత్సరాలకుపైగా చరిత్ర ఉన్న ముస్లిం పీర్ల పెంకుటిల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఆ స్థానంలో కొత్త కమ్యూనిటీ హాల్, పీర్లు భద్రపరిచేందుకు భవనాన్ని నిర్మించాలని ముస్లిం పెద్దలు కోరడంతో ఎమ్మెల్యే ఆర్కే, అధికారులు చర్చించి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు రూ.38 లక్షలు కేటాయించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కొలనుకొండ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, అమరా నాగయ్య, బీసీ విభాగం నియోజకవర్గ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు(బుల్లబ్బాయి), ముస్లిం పెద్దలు పఠాన్ రహమాన్‌తుల్లా, ఎస్‌కె వలి, ఎస్‌కె రబ్బాని, ఎస్‌కె కాజా, ఎస్‌కె జిలాని, ఎస్‌కె మీరా, ఎస్‌కె మొహమ్మద్, గుంటూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, తాడేపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు గొట్టిపాటి వెంకటేశ్వరరావు (జీవీఆర్), టి.రమణారావు, బాణావత్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు



ముస్తాబైన కైలాసగిరి శైవ క్షేత్రం



సీతానగరం పుష్కర ఘాట్లను పరిశీలిస్తున్న తాడేపల్లి సీఐ మధుసూదనరావు, ఏఈ కిషోర్

మేడికొండూరు: మహాశివరాత్రి పర్వదినానికి మండల పరిధిలోని పేరేచర్ల కైలాసగిరి కొండపై ఉన్న శైవ క్షేత్రం సన్నద్ధమైంది. కొండపై ఉన్న ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శైవ క్షేత్రానికి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య తెలిపారు. సీఐ జయకుమార్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. ఘాట్‌రోడ్డుతోపాటు, మెట్లమార్గం గుండా కొండపైకి వెళ్లేందు కు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

కృష్ణానది తీరంలో ఏర్పాట్లు పరిశీలన

తాడేపల్లిరూరల్: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీస్ శాఖ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను అధికారులు గురువారం పరిశీలించారు. సీఐ మధుసూదనరావు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన కృష్ణానదిలో స్నానాలు ఆచరించేందుకు వేలాది మంది భక్తులు విచ్చేయనున్నారని తెలిపారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కృష్ణా తీరంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశామని, గజ ఈతగాళ్లను సన్నద్ధం చేశామని, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రకాశం బ్యారేజ్ నుండి పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చేవారు శివాలయంలో పూజల అనంతరం సీతానగరం జీయర్ ఆశ్రమం మీదుగా, మహానాడు మీదుగా భక్తులు వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఏఈ కిషోర్, ఎస్ఐ ప్రతాప్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పలు ఆలయాలను ఆధునీకరించి విద్యుత్ దీప కాంతులతో సుందరంగా అలంకరించారు. తాడికొండ కొండపై వేంచేసి ఉన్న గంగా భ్రమరాంబ సమేత కొండ మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్ళేందుకు ఘాట్ రోడ్డును చదును చేశారు.

సచివాలయాలకు సోలార్ సిస్టమ్ ఏర్పాటుపై సమీక్ష

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ వేల్పుల రవికుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. సోలార్ ఉపయోగం గురించి, వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలి, విద్యుత్‌ను ఏవిధంగా ఆదా చేయాలనే విషయాలపై చర్చించారు. సంస్థ చైర్మన్ వేల్పుల రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఒక వస్తువు కాదు రక్షణ కవచం

తాడేపల్లి సీఐ మధుసూదనరావు



తాడేపల్లిరూరల్: వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తాడేపల్లి సీఐ మధుసూదనరావు అన్నారు. గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించామని, హెల్మెట్ కేవలం ఒక వస్తువు కాదని, ప్రమాదం జరిగినపుడు ప్రాణాన్ని కాపాడే ఆయుధమని అన్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు తాడేపల్లి బైపాస్ రోడ్ కనకదుర్గ వారధి నుంచి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వరకు పోలీసులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాసరావు, రమేష్, ప్రతాప్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పేరుకలపూడిలో ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ గంపల గంగాధరరావు లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. పేరుకలపూడి సచివాలయ ఇన్‌చార్జి ప్రవంత్, వీఆర్వో గోలి ప్రభాకర్, వార్డు మెంబర్లు గంటా అనూష, అట్లూరి కళ్యాణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ వైద్య పరీక్షలు

తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డోలాస్‌నగర్ అంబేద్కర్ కాలనీలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో స్త్రీలకు వచ్చే గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను, ఇతర పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 2 వేల రూపాయల విలువ చేసే వివిధ రకాల క్యాన్సర్ వైద్య పరీక్షలు ఉచితంగా చేసినందుకు మంగళగిరి సమతా హాస్పిటల్ డాక్టర్ పిన్నమనేని సుశీల, డాక్టర్ నవీన్‌లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వడ్డేశ్వరం జెడ్పీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు



వైద్యురాలు ఆవుల ఆషాను సత్కరిస్తున్న చలపతి విద్యాసంస్థల ట్రెజరర్ వై అనంతకుమారి, అధ్యాపకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ సౌజన్యంతో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళుతున్నారని, ఇది సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఆడపిల్లలను చదివించాలని సూచించారు. విద్య ద్వారానే మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని అన్నారు. అనంతరం పాఠశాలలోని 12 మంది ఉపాధ్యాయినిలను సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయినిలు వి. రవణమ్మ, ఎం.జ్ఞానజ్యోతి, కె.పద్మావతి, ఎస్.శివకుమారి, పి.సుజాత, అరుణ, క్లబ్ సెక్రటరి కె.ఉమామహేశ్వరరావు, ఎం.జవహర్‌లాల్, పూర్ణ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో...

దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో ఉన్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి, నాదెండ్ల మనోహరమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, రాజకీయంగా ఎదగాలని అన్నారు. విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. మహిళలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జానకి, గాయత్రి, జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, ఆషా, మంచికలపూడి వైష్ణవి, కేశనేని శ్రీఅనిత, రాఘవేంద్ర, విష్ణు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో....

మోతడక(తాడికొండ): మహిళలు అన్ని రంగాలలో సమష్టిగా ముందుకు నడిచి హక్కులను సాధించుకొని విజయబాటలో నడవాలని సైకాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఆవుల ఆషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల ట్రెజరర్ వై అనంతకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో విజయం సాధించాలని, అందుకు తగిన కృషి పట్టుదల అవసరం కనుక ఆ దిశగా ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా అతిథులతోపాటు పలువురు అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెల్లంకి రాజ్యలక్ష్మి, కొమ్మినేని ప్రతిమ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కో ఆర్డినేటర్లు డాక్టర్ బి తులసీరాణి, ఎస్ శాంతి ప్రియ, పి సుస్మిత వదన, జె స్రవంతి, ఎ లలిత, బి రోజారాణి, జి నాగలక్ష్మి, డి లావణ్య, డి రోజా వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.